ఉత్సాహంగా వనమహోత్సవం

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురంలో ఐరా గ్లోబల్ పాఠశాలలో శుక్రవారం వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రోజురోజుకు పెరిగిపోతున్న కాలుష్యాన్ని మొక్కలు పెంచడం ద్వారా నివారించవచ్చన్నారు. ప్రకృతివనం, పచ్చదనంపై చిన్నారులకు అవగాహన కల్పిస్తూ చెట్లను నాటే కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్‌రెడ్డి, స్కూల్ చైర్మన్ సందీప్ రావు, మేనేజింగ్ డైరెక్టర్ జార్జ్ పాల్, ప్రిన్సిపల్ పద్మజ, నవీన్, సంధ్య, పద్మశ్రీ, మానస, మాధవి పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతం ఖాయం

మలక్‌పేట: బీజేపీ మరింత బలోపేతం కావడం ఖాయమని మూసారంబాగ్ బీజేపీ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు నివాసానికి శుక్రవారం ఆమె పార్టీ నాయకులతో కలిసి వెళ్లి సన్మానించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. రాంచందర్‌రావు విద్యార్థి, యువ నాయకుడిగా, ఎమ్మెల్సీగా, న్యాయవాదిగా పార్టీకి ఎన్నో సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, రమేష్ రెడ్డి, రాంకోటేశ్వర్‌రావు, జెక్కా మోహన్‌రెడ్డి, మడిగెల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలు అవసరం



సైదాబాద్: సమాజ ప్రయోజనానికి నూతన ఆవిష్కరణలు అవసరమని ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం పేర్కొన్నారు. చంపాపేటలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్‌హాల్లో సక్సెస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ వారు హొరిజాన్ పేరిట నిర్వహించిన కళాశాల స్నాతకోత్సవం, మొదటి సంవత్సర విద్యార్థుల ఇండక్షన్ వేడుకలకు ఆయన హాజరై మాట్లాడారు. సమాజానికి హితం కలిగిస్తూ, ప్రకృతి పరిరక్షణ, విలువలను కాపాడే సాంకేతిక విజ్ఞానం అవసరమన్నారు.

మత సామరస్యానికి ప్రతీక పాతబస్తీ

సైదాబాద్: పాతబస్తీ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని హైదరాబాద్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం డబీర్‌పురాలోని బీబీ కా ఆలంను శుక్రవారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజల పర్వదినాలను పాతబస్తీలో కలిసి మెలిసి జరుపుకుంటారన్నారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అందరి పండుగలకు సమ ప్రాధాన్యం ఇస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మీర్ అస్గర్ అలీ బేగ్, సయ్యద్ అమీర్ హుస్సేనీ, ముస్తాఫా, సలీంఅలీ పాల్గొన్నారు.

అంకగణితంలో సత్తా



దిల్‌సుఖ్‌నగర్: నగరంలో జరిగిన తెలంగాణ ప్రాంతీయ స్థాయి సీప్ అబాకస్ మానసిక అంకగణితం పోటీలో ఆర్‌కేపురం వాసవీ కాలనీలోని సీప్ అబాకస్ విద్యార్థులు సత్తా చాటారు. వివిధ విభాగంలో 38 ట్రోఫీలు గెల్చుకున్నారు. వాసవి కాలనీ సీప్ అబాకస్ అకాడమీ నుంచి విద్యార్థులు జుఘ్నుష్ ఎస్, హుద్యన్విాయి ఎస్, సాకేత్ రామ్ కె, అన్విక్ రెడ్డి కె, సార్థక్ గుంత ప్రతిభ చాటారని నిర్వాకురాలు సంధ్యారాణి తెలిపారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులను సీప్ అబాకస్ అకాడమీలో అభినందించారు.

రైతు మృతికి వైద్యులు కారణమంటూ ఆందోళన



దిల్‌సుఖ్‌నగర్: ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న రైతు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. బాధితుల వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా, పెనుపహాడ్ మండలం, అనంతారం గ్రామానికి చెందిన బైరెడ్డి భగవంత్‌రెడ్డి(60) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత నెల 30న అనారోగ్యానికి గురవడంతో కొత్తపేట గ్రీన్‌హిల్స్ కాలనీలోని ఓజోన్ హాస్పిటల్‌లో చేర్పించగా పరీక్షించిన వైద్యులు భగవంత్‌రెడ్డికి ఓపెన్ హార్ట్ సర్జరీ చేయాలని సూచించి అందుకోసం రూ. 8 లక్షలకు ఒప్పందం కుదురుచుకున్నారు. ఈ నెల 2న ఉదయం 9 గంటల నుంచి రాత్రి వరకు రెండు దఫాలుగా ఆపరేషన్లు నిర్వహించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. దాదాపు 20 యూనిట్ల రక్తాన్ని ఎక్కించి రెండు రోజులుగా లోపలికి ప్రత్యేక చికిత్స విభాగంలోకి అనుమతించలేదున్నారు. శుక్రవారం రాత్రి ఐసీయూకి వెళ్లి చూడగా అప్పటికే భగవంత్‌రెడ్డికి చనిపోయి ఉన్నాడు. రెండు రోజుల క్రితం చనిపోయిన వ్యక్తికి వైద్యులు రక్తం ఎక్కించి తమను మోసం చేశారని కుటుంబ సభ్యులు హాస్పిటల్ ముందు ఆందోళనకు దిగారు.

ఏదీ పరిశుభ్రత.. అధికారులకు లేదా బాధ్యత?

● హస్తినాపురంలో కంపు కొడుతున్న కాలనీలు ● రోగాల బారిన ప్రజలు



విశ్వేశ్వరయ్య ఇంజనీర్స్ కాలనీలో నిలిచిన మురుగు



జిల్లాపరిషత్ రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

హస్తినాపురం: రహదారులపై పేరుకుపోతున్న చెత్తకుప్పలు, రోడ్లపై పారుతున్న మురుగుతో పరిసరాలు దుర్గంధంగా మారుతున్నాయని ఆయా ప్రాంతాల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని అనేక ప్రాంతాల్లో రోడ్లు ప్రధాన రహదారులపై చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. కాలనీల్లో మురుగునీరు రోడ్లపై పారుతూ దుర్గంధం వెదజల్లుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్యం లోపించిందని , స్వచ్ఛఆటోలలో చెత్త సేకరణ చేస్తున్నా కొందరు మున్సిపల్ సిబ్బందికి చెత్త ఇవ్వకుండా రోడ్లు, ప్రధాన రహదారులు, బహిరంగ ప్రదేశాలు, ఖాళీ స్థలాల్లో పారబోస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

దోమల విజృంభణ..

చెత్తను ఎక్కడపడితే అక్కడ వేస్తుండటంతో దోమలు, ఈగలు విజృంభించి రోగాల బారిన పడేస్తున్నాయని ఆయా ప్రాంతాల వాసులు వాపోతున్నారు. రోడ్లపై చెత్త వేసిన చెత్త గాలికి తమపైకి వచ్చి ప్రమాదాలకు దారి తీస్తోందని పలువురు వాహనదారులు వాపోతున్నారు. ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలోని అనేక ప్రాంతాల్లో తడిపొడి చెత్తను వేరు చేసి స్వచ్ఛ ఆటోలలో వేయాల్సి ఉండగా కొందరూ అవేమి పట్టుంచుకోకుండా రోడ్లు, ఖాళీ స్థలాల్లో పారబోస్తున్నారు. తడిపొడి చెత్తను వేరుచేసి ఇవ్వాలని వివిధ రకాలుగా అవగాహన కల్పిస్తున్నా కొందరిలో మార్పురావడం లేదని అధికారులు పేర్కొంటున్నారు.

కాలనీ అంతా దుర్గంధమే..



విశ్వేశ్వరయ్య ఇంజజీర్స్ కాలనీలో డ్రైనేజీ పొంగిపొర్లుతున్నా పట్టించుకోవడం లేదు. మా కాలనీలో ఎటు చూసినా మురుగు నీరు పారుతుండటంతో కాలనీ అంతా దుర్గంధంగా మారుతుంది. గత కొన్నినెలలుగా ఇదే పరిస్థితి ఉన్నా ఎవరూ స్పందించడం లేదు. మురుగుతో దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నాం. సంబంధిత అధికారులు స్పందించి మా కాలనీ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

– అమర్‌నాథ్‌యాదవ్, విశ్వేశ్వరయ్య ఇంజినీర్స్ కాలనీ ప్రధాన కార్యదర్శి

పొంగుతున్న డ్రైనేజీలు..

హస్తినాపురం డివిజన్ పరిదిలోని జిల్లా పరిషత్‌రోడ్డు ప్రధాన రహదారిపై పేరుకుపోతున్న వ్యర్థాలతో డంపింగ్ యార్డును తలపిస్తోంది. ఎప్పటికప్పుడు పేరుకుపోతున్న చెత్తను సంబంధిత సిబ్బంది తరలించకపోవడంతో దుర్గంధంగా మారుతుంది. దీనికి తోడు డివిజన్ పరిధిలోని విశ్వేశ్వరయ్య ఇంజనీర్స్‌కాలనీలో డ్రైనేజీ రోడ్లపై పొంగిపొర్లుతూ మురుగునీరు ఏరులై పారుతున్నా పట్టిచుకునే నాథుడే కరువయ్యాడని ఆయా ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై పారుతున్న మురుగుతో మురికి కుంటలను తలపిస్తూ దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి పేరుకుపోతున్న చెత్తను తరలించి, మురుగునీటి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

భారతి సిమెంట్‌కు తిరుగులేదు



బహుమతులు అందచేస్తున్న సునీల్

చంపాపేట: భారతి సిమెంట్‌కు తిరుగులేదని సంస్థ టెక్నికల్ మేనేజర్ సునీల్ అన్నారు. గురువారం రాత్రి చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని సింధూర కాన్ఫరెన్స్ హాల్లో భవన నిర్మాణ కాంట్రాక్టర్లతో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ పేరుతో నూతనంగా ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్‌ను ఉత్పత్తి చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేవారు. ఇతర బ్రాండ్ల సిమెంట్‌తో పోలిస్తే అల్ట్రాఫాస్ట్ సిమెంట్‌తో భవన నిర్మాణ ప్రక్రియ వేగవంతంగా పూర్తి కావటమే కాకుండా పటిష్టంగా ఉంటుందన్నారు. అనంతరం డీలర్లు, కాంట్రాక్టర్లకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీలర్ శ్రీనివాస్, టెక్నికల్ ఇంజనీర్ ఎండీ సాహెర్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

సైదాబాద్: డివిజన్ పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆమె సైదాబాద్‌లోని గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి అక్కడ అందజేస్తున్న వసతులపై ఆరా తీశారు. వర్షం వచ్చినప్పుడు కేంద్రంలోని గోడల నుంచి వర్షం నీరు లీకవుతుందని, దాంతో వస్తువులు తడిసి వృథా అవుతున్నాయని సిబ్బంది కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని జీహెచ్‌ఎంసీ ఏఈ వెంకన్నను కోరారు.

మెట్రో స్టేషన్ల వద్ద బందోబస్తు



మెట్రో స్టేషన్ వద్ద ఏసీపీ కృష్ణయ్య

చైతన్యపురి: జాబ్ క్యాలెండర్ అమలు చేసి అన్ని ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేయాలని 'హలో నిరుద్యోగి–చలో సెక్రటేరియట్' పేరుతో నిరుద్యోగ జేఏసీ పిలుపు మేరకు దిల్‌సుఖ్‌నగర్ రాజీవ్‌చౌక్, మెట్రో స్టేషన్ల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మెట్రో స్టేషన్‌లోకి వెళ్లే ప్రయాణికులు, యువకులను క్షుణ్ణంగా పరిశీలించి అనుమతించారు. జాక్ పిలుపు మేరకు బంద్‌లో పాల్గొనే వారిని అడ్డుకున్నారు. ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య బందోబస్తును పర్యవేక్షించారు.

నిధులు కేటాయించాలని వినతి

మన్సూరాబాద్: డ్రైనేజీ పనులకు నిధులు కేటాయించాలని జలమండలి, సివరేజీ బోర్డు ఎండీ అశోక్‌రెడ్డిని శుక్రవారం మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు నూతన డ్రైనేజీ ఏర్పాటుకు నిధులు మంజూరు చేసి మన్సూరాబాద్ పెద్ద, చిన్నచెరువుల్లోకి మురుగునీరు చేరకుండా చర్యలు చేపట్టాలని వివరించినట్లు పేర్కొన్నారు.

8 నుంచి ఆధునిక తపాలా పరిజ్ఞానం ద్వారా వేగవంతమైన సేవలు

వనస్థలిపురం: వినియోగదారులకు మరింత వేగవంతమైన, సమర్థవంతమైన సేవలు అందించేందుకు ఆధునిక పోస్టల్ టెక్నాలజీ ఐటీ 2.0 పేరుతో ప్రవేశ పెడుతున్నట్లు తపాలా శాఖ ప్రకటించింది. తెలంగాణ తపాలా శాఖ సర్కిల్ ఆఫీసు, రీజనల్ ఆఫీసు ఆదేశాల మేరకు హైదరాబాద్ సౌత్ ఈస్ట్ డివిజన్‌లో ఈ సేవలు ఈ నెల 8 నుంచి అందుబాటులోకి వస్తాయని డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ హైమావతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో జూలై 7న ఆ డివిజన్ పరిధిలోని అన్ని పోస్టాఫీసుల్లో ఎలాంటి లావాదేవీలు జరగవని, వినియోగదారులు సహకరించాలన్నారు.

నాలా ఆధునీకరణతో వరద సమస్యకు చెక్



కాలనీలో పర్యటిస్తున్న వంగ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్ బైరామల్‌గూడ చెరువు సమీపంలోని వరదనీటి కాలువ ఆధునీకరణ పనులు ప్రారంభిస్తే హరిజనవాడకు వరద ముంపు సమస్యకు చెక్ పడుతుందని కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన కాలనీలో పర్యటిస్తూ స్థానిక సమస్యలపై ఆరా తీశారు. అనంతరం మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ..హరిజన బస్తీ బైరామల్‌గూడ చెరువు సమీపంలో ఉండటంతో కాలనీలోని గుడిసెలు, ఇళ్లను జీహెచ్‌ఎంసీ, హైడ్రా అధికారులు కూల్చివేస్తారనే అపోహ వీడి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నాలా వెంట కాలనీకి అడ్డుగా పటిష్టమైన గోడ నిర్మాణం చేపట్టేందుకు ఇప్పటికే ప్రణాళికను కూడా సిద్ధం చేసినట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఈఈ కార్తీక్, ఏఈ సురేష్, నాయకులు నరేందర్‌రెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, శ్రవణ్‌కుమార్, వెంకటేష్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గౌతమినగర్ కాలనీలో ఓపెన్ జిమ్,స్ట్రామ్ వాటర్ డ్రైన్ మంజూరు చేసినందుకు కాలనీ సంక్షేమ సంఘం నాయకులు శుక్రవారం బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సుధాకర్‌గౌడ్, నారాయణరావు, కిషన్, గోపిచంద్, భాస్కర్, శ్రీహరి రెడ్డి, జగన్, రామరావు పాల్గొన్నారు.

ఆ వైస్ చైర్మన్‌ను తొలగించాలి



మంత్రి తుమ్మలను కలిసిన టీఎన్‌జీఓస్ నాయకులు

చాదర్‌ఘాట్: మహబూబ్‌నగర్ మార్కెట్ కమిటీ ఉద్యోగిపై వైస్ చైర్మన్ దాడి గురించి రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, సంచాలకులు సురేంద్ర మోహన్‌ను కలిసి వివరించామని టీఎన్‌జీఓస్ ఏఎంసీ ఎంప్లాయిస్ సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు చిలుక నర్సింహారెడ్డి, కార్యదర్శి ముక్రం తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైస్ చైర్మన్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని విజ్ఞప్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ముజీబ్ హుస్సేన్, వెంకటేశం, సంతోష్, అశోక్, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

వివేకానందుడి ఆశయ సాధనకు కృషి

సైదాబాద్: నేటితరం యువతకు స్వామి వివేకానంద స్ఫూర్తి ప్రదాతగా నిలుస్తారని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వివేకానందుడి వర్ధంతి పురస్కరించుకొని ప్రెస్‌కాలనీలోని ఆయన విగ్రహానికి కార్పొరేటర్ బీజేపీ నాయకులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వివేకానందుడి ఆశయ సాధనకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మధుకర్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, శంకరాచారి, విజయ్‌కుమార్, మహేందర్ రెడ్డి, నవీన్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



వివేకానందుడి విగ్రహానికి నివాళి అర్పిస్తున్న శ్వేతమధుకర్‌రెడ్డి

దొడ్డి కొమురయ్య త్యాగం మరువలేనిది



కొమురయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

నాగోలు: సాయిధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య త్యాగం మరువలేనిదని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. శుక్రవారం దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా కొత్తపేట డివిజన్ న్యూ నాగోలులోని ప్రజా సంఘాల కార్యాలయంలో బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో మండల నాయకులు మల్లేష్ గౌడ్ అధ్యక్షతన కొమురయ్య వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కృష్ణ మాట్లాడుతూ.. ఆనాడు తెలంగాణలో నూతన యుగ ఆవిష్కరణకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం అంకురార్పణ జరిగిందని అన్నారు. 1940–1951 వరకు సాగిన భూమి, భుక్తి కోసం..వెట్టిచాకిరి విముక్తి కోసం సాగిన పోరాటంలో పాల్గొన్న నాయకుల్లో దొడ్డి కొమురయ్య ఒక్కరని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో దండు నిరంజన్, సంఘ సైదారావు, చేరుకు నాగభూషణం, ఎండీ హమీద్, జగన్ యాదవ్, కే మురళి, సిహెచ్ ఈశ్వర్ పాల్గొన్నారు.

సైదాబాద్ ఎస్సై సాయికృష్ణపై చర్యలు తీసుకోవాలి



డీసీపీకి ఫిర్యాదు చేస్తున్న సేవాలాల్, సీపీఐ నాయకులు

సైదాబాద్: సింగరేణి కాలనీలో అక్రమ వసూళ్లు, సెటిల్‌మెంట్లకు సైదాబాద్ ఎస్సై సాయికృష్ణ పాల్పడుతున్నాడంటూ ఆరోపిస్తూ ఆయనపై చర్యలు తీసుకోవాలని పలువురు సేవాలాల్ బంజారా సంఘం, సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్యకుమార్‌ను కలిసి ఫిర్యాదు చేసారు. అనంతరం సేవాలాల్ బంజారా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు మోతీలాల్ నాయక్ మాట్లాడుతూ.. సింగరేణి కాలనీలో కొందరు అక్రమంగా చేస్తున్న వ్యాపారాలను అడ్డుకోవాల్సిన ఎస్సై సాయికృష్ణ వారి నుంచి ప్రైవేట్ వ్యక్తి ద్వారా వసూళ్లకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. సింగరేణి కాలనీలో చోటు చేసుకునే చిన్న చిన్న గొడవలను సైతం తనకు లబ్ధి చేకూరేలా మార్చుకుంటున్నాడని అన్నారు. సివిల్ తగాదాల్లో తలదూర్చడమే కాకుండా వాటిపై ప్రశ్నించిన మహిళా నాయకురాలు సక్రిబాయిపై కేసు పెడుతా అంటూ పీఎస్‌లో నిర్బంధించాడని వివరించారు. ఫిర్యాదు చేసిన వారిలో షేక్ మహమూద్, హరినాయక్, మోహన్ నాయక్, వస్రం నాయక్ ఉన్నారు.

బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలి



ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు వినతి పత్రం ఇస్తున్న శ్రీనివాస్

చాదర్‌ఘాట్: కాంగ్రెస్ పార్టీ హామీ మేరకు ఆర్టీసీ బస్సులలో దివ్యాంగులకు ఉచిత సౌకర్యం కల్పించాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి నాయకుడు నల్లగొండ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరుతూ ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు వినతిపత్రం ఇచ్చామన్నారు. వికలాంగులకు అనుకూలమైన నాలుగు శాతం ఉద్యోగాలు ఇవ్వాలని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం అన్ని బస్‌స్టేషన్‌లలో వికలాంగులకు అనుకూలంగా వసతులు మార్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గుత్తికొండ కిరణ్, నాగరాజు, ఆజిమ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శాకాంబరి ఉత్సవాలు



మన్సూరాబాద్: నాగోలు డివిజన్ పరిధి శ్రీసాయినగర్‌కాలనీలోని శ్రీదుర్గాదేవి ఆలయంలో శాకాంబరి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల కూరగాయలతో దుర్గాదేవిని అలంకరించారు. దుర్గాదేవి శాకాంబరి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం ఆలయ కమిటీ నేతలు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పోచబోయిన గణేష్‌యాదవ్, నాయకులు యాదగిరి, హనుమంతరావు, రమేష్, రవి, మురళీ, అశోక్, రమణమూర్తి, అజయ్, లక్ష్మయ్య, కేశవులు, అర్చకులు బాల మురళీ శర్మ పాల్గొన్నారు.

నియామకం

చైతన్యపురి: ఏబీవీపీ దిల్‌సుఖ్‌నగర్ నగర కార్యదర్శిగా చవ్వ విశ్వతేజను నియమిస్తున్నట్లు హైదరాబాద్ మహానగర సంఘటన కార్యదర్శి సాదినేని రాజశేఖర్ ప్రకటించారు. ఈ సందర్భంగా విశ్వతేజ మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలోనే స్టూడెంట్స్ హబ్‌గా పేరుగాంచిన దిల్‌సుఖ్‌నగర్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ఉద్యమిస్తామన్నారు.

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం చేయొద్దు



బీఎన్‌రెడ్డినగర్ కాలనీలో పర్యటిస్తున్న లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం చేయొద్దని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన డివిజన్ పరిధిలోని బీఎన్‌రెడ్డినగర్ కాలనీలో స్థానికులతో కలిసి పర్యటించారు. పారిశుద్ధ్య పనులు సరిగ్గా నిర్వహించడం లేదని, రోడ్లను శుభ్రం చేయడం లేదని, ఈ సందర్భంగా స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రోడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటామని, వీలైనంత త్వరలో కాలనీలో నెలకొన్న ప్రతి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పురుషోత్తంరెడ్డి, ప్రదీప్‌రెడ్డి, ధన్‌రాజ్, లక్ష్మారెడ్డి, రాములు, నవీన్, రవికిరణ్‌రెడ్డి, మల్లారెడ్డి, కాశిరెడ్డి, హరగోపాల్, రామచంద్ర, అజయ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్టు

చైతన్యపురి: వేర్వేరు ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తుండగా ఎస్‌టీఎఫ్‌సీ బృందం దాడిచేసి స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు వివరాల ప్రకారం.. సరూర్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న సమాచారం అందుకుని టీం ఎస్ఐ శోభారాణి ఆధ్వర్యంలో సిబ్బంది గంజాయి విక్రయిస్తున్న సబావత్ హనుమను అదుపులోకి తీసుకుని మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు నల్గొండ జిల్లా పీఏపల్లి మండలం చింతతండాకు చెందిన వాడిగా గుర్తించారు.

ధూల్‌పేటలో..



ధూల్‌పేటలోని ఓ ఇంట్లో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు దాడి చేసి గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు టీం లీడర్ అంజిరెడ్డి తెలిపారు. గంజాయి విక్రయిస్తున్న మాయబాయిని అదుపులోకి తీసుకుని ధూల్‌పేట ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. ఇదే కేసుతో సంబంధం ఉన్న మరో నిందితుడు బల్‌దేవ్ సింగ్‌పై కూడా కేసు నమోదు చేశామన్నారు.